

యీ పిల్లేరా అన్నాను నేను రెట్టిస్తూ.

ఏదో ఫోటోగ్రాఫర్ అని కోశావ్ అన్నాడు మావాడు ఒకరకంగా చూస్తూ. లేదు మామా ఈ పిల్లే. ఫోటోగ్రాఫరే. నేను మరిచిపోయే ప్రసక్తే లేదు అని అరిచాను.

అయితే ఆ సముద్రంలో తిరుగుళ్ళూ ఫోటోగ్రఫీ–నీకు బాగా తాటాకులు కట్టిందిరా. అట్లాంటి పిల్ల అయితే ఇక్కడెందుకుంటాది? అన్నాడు మావాడు నన్ను యేమాత్రం నమ్మకుండా.

ఆ పత్రికని తదేకంగా చూస్తున్నాడు మావాడు. వాడి భుజాలమీద వొంగి చూస్తున్నాను నేను. సాయుధ పోరాటాల గురించిన ఒక వ్యాసంలో వుంది ఆ పిల్ల ఫోటో. చాలా మందిలో వొక్కర్తిగా.

ఆలివ్ గ్రీన్ యూనిఫామ్. చేతిలో ఎకె 47.

మావాడికొచ్చిన డౌట్ నాక్కూడా వుంది. కానీ కళ్ళముందు అచ్చు గుద్దినట్టు ఆ పిల్ల మెరుస్తున్న కళ్ళు నన్ను పలకరిస్తుంటే యెట్లా నమ్మకుండా వుండేది! చాలా కష్టం నాస్తవాన్ని నమ్మడం.

నేను నా కవిలికట్టలు కెలకడానికి తయారయ్యాను.

యేం చేస్తున్నావ్ అన్నాడు మావాడు.

నేను నా నోట్సులూ పాత కాయితాలూ పుస్తకాలూ తీసి దుమ్ము దులపడం మొదలుపెట్టాను.

దుమ్ము లేస్తుంటే తుమ్ములు. వాడు తుమ్మడం నేను తుమ్మడం. లేచే దుమ్ముని కిటికీలో యెండ కోస్తోంది.

నీ సాక్ష్యాధారాలను దెయ్యాలు దొబ్బినాయిలే. ఎప్పుడయినా మంచి తీరికలో వెతకొచ్చు. అంతా డస్ట్‌బిన్ చెయ్యొద్దు అని అరుస్తున్నాడు వాడు. నా పనిలో నేనున్నాను. చివరికి ఆ కాయితాలు దొరికాయి. చుట్టూ చెల్లా చెదురుగా పడున్న కాయితాలు పుస్తకాల మధ్య మోకాళ్ళ మీద కూచున్నవాణ్ణి కూచున్నట్టే చదవడంలో మునిగిపోయాను. యెండ తగుల్తున్నచోట అక్షరాలు ఒక వింత రంగులో కనిపిస్తున్నాయి.

యేందది? అన్నాడు మావాడు.

అప్పటికే నేను ఆ మ్యాప్ ప్రింట్ లెటర్ పాడ్‌లో రెండో కాయితంలోకి వచ్చాను. నా కళ్ళు ఆ అక్షరాలకి అంటుకు పోయాయి. తల తిప్పకుండానే ఫస్ట్ పేజీని మా వాడికిచ్చాను.

ఆ పిల్ల మాట్లాడిన మాటలు అవి. రఫ్‌గా రాసి పెట్టుకున్నా. యేదయినా స్టోరీకి ఉపయోగపడక పోతాదా అని. ఒక మూల నిశ్చల ఛాయాగ్రాహి అని శీర్షిక కూడా వుంది. నవ్వొచ్చింది. గంభీరమైన సంస్కృత పదాలమీద మోజు నొదలని టైమ్ అది.

చదివింది చదివినట్టు మావాడికిచ్చేస్తున్నా కాయితాలు నొక్కొక్కటీ.

## కాయితం-1

కుండపోత వానలో ఒక రాత్రి (వూరు పేరు కొట్టేశాను) దేవాలయం రాతి చావిడిలో చిక్కుకు పోయాను. కొంతమంది టూరిస్టులూ బిచ్చగాళ్ళూ బైరాగులూ నొక వృద్ధురాలు గూటిలో గువ్వల్లాగా ముడుక్కున్నాం. ఆ వర్షం కురిసే తీరులో అధికారం అహంకారం కనిపిస్తోంది. యేదో పురాతన శాపనాన్ని అమలు పరుస్తున్నట్టుగా వుంది. క్షణ క్షణానికీ శరీరాన్ని విస్తరిస్తున్న వింత జంతువులా వుందది. (రచయిత Identity Crisisని ఎత్తి చూపించే వర్ణన?) యేమని తిట్టానో సరిగ్గా గుర్తులేదు నాకు వానని. పెద్ద బూతు మాటే అన్నాను అచ్చ తెలుగులో.

మిమ్మల్నేమి అనిందది? అని ఒక సన్నటిగొంతు నా పక్కనించే వినిపించింది. ఆ అమ్మాయి అట్లా కల్పించుకోవడం ఒక రకంగా నచ్చింది. ఒక రకంగా నచ్చలేదు.

అది మీకేదో బంధువైనట్టు వెనకేసుకొస్తున్నారే అన్నాను.

వర్షంతో నాకు బంధుత్వమా? బావుంది అందామె.

ఆమెను నాలుకంట చూసి నా ధోరణిలో నేను పడ్డాను.

ఒక్కసారి కమ్మటి పొగాకు వాసన రావడంతో ప్రాణం పీకింది.

## 2

ఆ అమ్మాయే కాలుస్తోంది.

నా సిగిరెట్లు ఎప్పుడో అయిపోయాయి. లేకుంటే నేనూ యెంజాయ్ చేద్దును వర్షాన్ని. ఉన్నట్టుండి మరింత పేదవాణ్ణయిపోయినట్టుగా వుంది నాకు.

పోనీ అడిగితే?

నేను అడగలేక పోయాను. లేనంటేనో? ఎంత నామోషీ! నెగెటివ్ థింకింగ్! ఫాల్స్ ప్రిస్టేజ్!


అడుగు. ఇది సందర్భం కాకపోతే ఇంకేదీ సందర్భం కాదురా అని నా లోపల యెవరో అరుస్తున్నారు.

ఇంతలో కాలుస్తారా? ఇది చివరిది అని చెయ్యి చాచిందామె. నేను యేమాత్రం వూహించలేదు. చాలా తటపటాయించాను. ఆమె మళ్ళీ రెట్టించనూ లేదు. చెయ్యి వెనక్కి తీసుకోనూ లేదు. ఆమె తీరులో లెక్క తప్పని ఆత్మవిశ్వాసం, సందర్భ శుద్ధిగల ఆజ్ఞాపన చూసి విస్మయం చెందాను.

నేను తీసుకున్నాను. థ్యాంక్స్ అని గొణిగాను.

యే ఉపోద్ఘాతమూ లేకుండా ఆమె మాట్లాడుతోంది.

– ఇదే వాన సాయంకాలపు నీరెండలో నడి సముద్రంలో పడుతుంటే చూడాలి. అంతా ఇసిక యెడారి మాదిరిగా వుంటుంది. ఎంత కళ్ళు పొడుచుకున్నా సముద్రం కనపడదు. సూర్యరశ్మిలో వాన సముద్రాన్ని బాదుతుంటే ఎంత హైస్పీడ్ సెన్సిటివ్ ఫిలిమ్ అయినా ఎడారిని తప్ప యింకేం capture చెయ్యదు. మనం ఎంత యేమారిపోతామంటే చివరికి ఆ నకిలీ ఎడారిలో మనకు ఎండమావులు కూడా కనిపిస్తాయి అంది.



## 3

మంచి కాలక్షేపమే అనుకున్నాను.

ఆమె భుజాన కెమెరా ఇంతకు ముందే చూశానేను. ఫలానా ఎఫెక్టుకి యే ఫిల్టర్ వాడుతారు అని అడిగి చూడండి యిలాంటి వాళ్ళని తెల్లమొగం వేస్తారు. ఇట్లా టూర్ నొచ్చినప్పుడు అలంకార ప్రాయంగా బడాయిగా మెడకు తగిలించుకునే బాపతే యెక్కువ. వీళ్ళలో చాలామందికి కెమెరా ఎట్లా వోపెన్ చెయ్యాలో కూడా తెలీదు. భర్తలో బాయ్ ఫ్రెండ్సో కొనిపెడితే క్లిక్ క్లిక్ మనిపిస్తూ తిరిగే డాలర్ లైవ్ మానవులు వీళ్ళు.

– మీకు తెలుసా సముద్ర ప్రయాణంలో నాన ఒక వారంలో స్త్రీల వయసును ఎంతో తగ్గించేస్తుంది. ఈ వింతకి ఎక్కడా వివరణ లేదు. ఎట్టికీ డబ్బు ముల్లె వాళ్ళు కేవలం ఫోటోలు దిగడానికే సముద్రంలో దూరప్రయాణాలు చేస్తుంటారు. యంగ్‌గా కనిపించే ఫోటోల కోసం. నేను అలాంటి వాళ్ళని ఫోటోలు తీశాను అధికారికంగా అనధికారికంగాను.

ఆమె మాట్లాడుతోంది నేను వింటున్నాను.

– తమాషా యేమంటే మగవాళ్ళు మాత్రం వయసు ముదురుతారు అని ఆమె నవ్వింది.

నాకు నవ్వు రాలేదు.

– వర్షాన్నే కాదు–దేన్నయినా మేం సహించినంతగా మీరు సహించలేరు. ఆమె స్టేట్‌మెంట్ విసిరింది. నేను రియాక్ట్ కాకుండా ముంగిలా వుండిపోయా. రచయితలు ఎంత బాగా దాక్కోవచ్చు! కలం కాయితాలతో పనేముంది యెప్పుడూ–కాని ఫోటోగ్రాఫర్ అంటే అట్లా కాదు. నా జిత్తులమారి మౌనం నాకు సుకంగా అనిపించింది.

మీరెప్పుడయినా సముద్ర ప్రయాణం చేశారా అని ఆమె అడిగింది.

## 4

ఊహూ అన్నాను.

పోనీ వర్షంలోనైనా తడిశారా? అని ఆమె నవ్వింది.

యేడవలేక నేనూ నవ్వాను.

నా వృత్తే సముద్ర ప్రయాణం అందామె.

# సైకోగ్రాఫర్

— సౌదా

ఆ మాట ఆమె మామూలుగా అన్నప్పటికీ నన్నెవరో తక్కువ చేసినట్టు అనిపించింది. ఈ అనిపించడానికి అంతెక్కడ? రచన నా వృత్తి అని చెప్పడానికి నా సంకోచం నాది. మహాబలిపురం దగ్గర ఒకే ఒక్కసారి మాత్రం నేను సముద్రాన్ని చూశాననేది ఆమెకు ఎట్లా అయినా తెలిసిపోతుందేమోనని చిన్నబోయాను.

ఇంతలో పెద్ద మెరుపు మెరిసిపోయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. ఆ కాంతిలో మా రాతి చావిడి ఎక్కడికో కొట్టుకు పోతున్నట్టు తోచింది. మళ్ళీ చీకటికి అలవాటుపడ్డం కోసం కళ్ళు మూసుకున్నానో లేదో మళ్ళీ మెరుపు. వెలుగు మరక అంటింది నా కనురెప్పల పైన.

– సూర్యరశ్మికి కళ్ళు మిరుమిట్లు గొలిపే మంచులో తిరిగాను నేనొకసారి రోజంతా. చీకటి పడగానే నా బస చేరుకున్నా. యేముంది ప్రతి వస్తువూ పింక్ రంగులో కాలిపోతున్నట్టే కనిపించడం మొదలు పెట్టింది. చివరికి అద్దంలో నా ముఖం కూడా కాలిపోతోంది. వరసగా మూడు రాత్రిళ్ళూ మూడు పగళ్ళూ నా గది నొదిలి బయటికి రాలేదు మా డాక్టర్ సలహా ప్రకారం. యేమయినా ప్రతి వస్తువూ ఎర్రగా కనిపించడం చాలా హారిబుల్ థింగ్. నేను తాగే నీళ్ళు కూడా. ఆ స్థితిలో నేను తీసిన ఫోటోలు మాత్రమే మానవ మనోవైకల్యానికీ యంత్ర సాంకేతిక స్థిర చిత్రానికీ మధ్య తేడాను చెప్పగలిగాయి.

ఆమె వసపిట్టలా వాగుతూంది.

## 5

ఇంతకీ ఆమె ఎవరు? ఇక్కడికి యే పనిమీ దొచ్చింది? వొంటరిదా? యెవరైనా తోడున్నారా? పెళ్ళయిందా? భయం లేదా? ఇట్లా తిరుగుతుంటే ఆమె ఇంట్లో ఎవరూ యేమీ అనరా? సెంపకం కొద్దీ సందేహాలు.

లాస్టు బస్సు మీద ఆశ యెప్పుడో పోయింది. ఇక తెల్లారే బస్సు. ఈ రాత్రి వర్షపు హోరులో చీకటి జాగారమే గతి. నేను ఎక్కడా స్టే చెయ్యలేదు. వర్షాన్నుంచి తప్పించుకున్నాగాని చావిడిలో రాను రాను చలి పెరుగుతోంది. వ్యాపిస్తోంది. అయితే వాన తగ్గుతుందేమో అనుకున్నాను. నా సంచిలోంచి శాలువా తీసి కప్పుకున్నాను వెచ్చగా.

వర్షం బాలేదా? అని అడుగుతోందామె అమాయకంగా.

నువ్వేమన్నా వాన దేవతవా? అన్నాను కొరకొరా చూస్తూ.

వానదేవతకు శాలువా అవసరం. అని దగ్గరగా జరిగిందామె.

నేను చాలా తటపటాయించాను.

అప్పుడు నాలో ఎన్ని ఆలోచనలు ముసిరాయో రాస్తే యింకో పుస్తకం అయ్యేది.

నా శాలువా ఒక అంచు లాక్కుని కప్పుకుందామె.

నేను తటాలున శాలువా నొదిలేశాను.

కాని అంతలోనే పక్షి రెక్కలా వాలింది శాలువా నామీద. అపరిచితుడితో ఒకే శాలువను పంచుకోవడం ఆ అమ్మాయికి ఇబ్బందికరంగా యేమీ లేనట్టుంది. నాలో నేను చాలా పిరికిగా ఎడంగా నొదుక్కున్నాను.

– ఎన్నో రకాల ఆహార పదార్థాలుంటాయి నోడల్లో. మంచి ఫోటోలు తియ్యడమే నీ పని అనుకుంటే నీటన్నింటికీ దూరంగా వుండాలి. నీ శరీరం ఎంత తేలిగ్గా వుంటే నీ కెమెరా అంత తేలిగ్గా వుంటుంది. దీనికి అరాచకమైన క్రమశిక్షణ కావాలి. కెమెరాను ప్రేమించేవాళ్ళకిది సులభ సాధ్యం. కెమెరా కన్నా ప్రేమ సులభం మరొకటి లేదు. నువ్వు చాలా సులభంగా దానికి దగ్గర కావచ్చు. కష్టసాధ్యమైన ప్రత్యేకమైన ఫోటోలు తియ్యాలంటే నువ్వు అంతే ప్రత్యేకంగా జీవించాలి. దీనికి దగ్గర దారి లేదు.

ఆ అమ్మాయి వాక్ ప్రవాహానికి అంతం లేకుండా వుంది. ఇంత దగ్గరగా ఒకే శాలువలో ఉండడం గురించి నేనేం అనుకుంటానో అనే ఫీలింగ్ అసలు వుందా? లేదా?


## 6

ఆ అమ్మాయి మాట్లాడుతూనే వుంది.

– మబ్బుల పురవడీ వాటి చలచ్చంచల రూపాలూ ఇవన్నీ కూడా మనకు తెలిసిన మేథమెటికల్ యీక్వేషన్స్ ప్రకారమే వుంటాయి. మబ్బులను ఇంటర్‌ప్రెట్ చెయ్యడానికి ఎప్పుడైనా ప్రయత్నించావా? ఒకసారి మబ్బులు నల్లని మందలు మందలుగా మా ఓడను చుట్టుముట్టాయి. నేను చూస్తూ వుండగానే మబ్బుల మధ్య నుండి ఒక తెల్లటి తలుపు తెరుచుకుంది. అది చూసి తీరాలి. ఆ దృశ్యం ముందు మాటలు నొట్టిపోతాయి. పైన ఏదో చెరువు తెగినట్టుగా దూకింది వాన దాన్లోంచి. సముద్రంలోకి ఎవరో ఒక పారదర్శకమైన స్తంభాన్ని దింపుతున్నట్టుగా వుందది. చేతిలో కెమెరా లేదు. పరిగెత్తాను కిందకి కేబిన్‌లోకి. తాళం వేసుంది. ఎవరూ లేరు. ఆర్తనాదం చేశాను. బెల్ బోయ్ పరుగెత్తుతూ లేస్తూ నొచ్చాడు యేం జరిగిందని. లోపలికెళ్ళి కెమెరాతో ఒక్క వూపున డెక్ మీదికొచ్చాను.

ఏం లేదక్కడ. మామూలుగా వుంది ఆకాశం. అంతా యెవరో తుడిచేసినట్టుగా వుంది. ఆ కోత యిప్పటికీ నా జ్ఞాపకాల్లో సలుపుతూ వుంటుంది.

ఇంతకీ సముద్రం మీద అమిత వేగంతో ప్రయాణిస్తున్న ఓడలోవున్నాను నేను. సెను గాలులు వీస్తున్నాయి. మబ్బులకు దిక్కులేదు. వర్ష రేఖను ఎప్పుడో దాటేసింది ఓడ. ప్రకృతి ఇంకా బాల్య చేష్టల్లోనే వుంది. మా ఫోటో గ్రాఫర్లది ఉత్కంఠ భరితమైన వృత్తి. కెమెరా అనేది మా శరీరంలో ఒక భాగమైపోవాలి. మీ రచయితలదే సులువంటే అని ఓరగా చూసిందామె.



## 7

ఆ చివరి మాటకు నేను తుళ్ళిపడ్డాను.

నేనేం రచయితను కాను అన్నాను.

ఊరికే అన్నా. ఎవరినైనా యేమైనా చేయగలదీ వాతావరణం. ఆంధ్రదేశంలో ఇప్పటికి నాలుగువేల మందికిపైగా కథలు రాసి అచ్చేశారు. మీకు కూడా అన్యవృత్తివల్ల జీవనం గడిచిపోతుంటే ఒకటీ రెండు కథలు రాసి మరిచిపోతారు. జీవనం గడవడం గురించి నెపమెన్నుతారు. కెమెరాతో తప్ప యింకదేన్తోనూ రోజు గడవదు నాకు. అప్పుడప్పుడు ఏమీ తినడానికి లేకపోవడం నిజమేగాని ఈ యంత్రపు కూన లక్ష్యమేమిటా? అని ఆశ్చర్యపోతూ అది మర్చిపోతాను. తెలివితక్కువ దృశ్యాలకి ఫిలిమ్ వృథా చేశాననుకో అసలు చిత్రాన్ని పసిగట్టినప్పుడు ఖాళీ కెమెరా వెక్కిరిస్తుంది సముద్రం మీద ఫిలిమ్ దొరకదు. ఒక్కొక్కసారి చేతిలో కెమెరా వుండగానే సూర్యోదయాలూ సూర్యాస్తమయాలు అట్లా కరిగిపోతుంటాయి. మైమరుపులోపడి ఫోటోలు తీయడమే మరిచిపోతాను. నేను చూస్తున్న దాన్ని చాలామంది చూసి వెళ్ళిపోతూ వుంటారు. వాళ్ళకు అక్కడ ఏదీ అనదేమో. సూర్యోదయం సూర్యాస్తమయం సముద్రం మీద అద్భుతంగా కనిపించే నిర్మాణాలు. నీటి తర్వాతనే చంద్రోదయమైనా, చల్లని యెండా వెచ్చని చలీ విసురులేని గాలీ ముసురులేని వానా నా డ్రీమ్ వెదర్.

మాటల్లోపడిపోయిందామె. ఆమె బిగ్గరగా ప్రారంభించి ఇప్పుడు తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు తగ్గించి వేసింది గొంతు.

నీకు ఇప్పుడు భయంగా లేదా? అనే ఒక పనికి మాలిన ప్రశ్నతో ఆమెకు అడ్డుపడ్డాను.

ఊ–చాలా–భయం–నాకు అంది నవ్వి.

నవ్వొచ్చింది మాటలకున్న అల్పత్వం గురించి.

బ్లాటింగ్ పేపర్ మీద వాటర్ కలర్ లాగా శాలువలోకి సన్నగా వెచ్చదనం పాకుతోంది.


గర్జిస్తూ జూలు విదుల్చుతూనే వుంది వాన.

వాన తెరలు తెరలుగా యేవో పెద్ద కాళ్ళు నడిచిపోతున్నట్టుగా వుంది మాముందు.

క్లిక్ మని ఫ్లాష్ లైట్ వెలిగింది.

వర్షంతోపాటు ఎవరో పైకీ కిందకీ కురుస్తున్నట్టుగా కనిపించింది ఆ వెలుగులో.

నిమగ్నమై ఆమె కెమెరా లెన్స్ కేప్ వేస్తోండగా ఆ



వింత ఆకారం మా చావిట్లోకి వొచ్చి వొంగుతూ నిలబడింది.

క్షణం కిందటి దాకా నాతో వసపిట్టలా వాగుతూనే వుంది–ఇంతలో వర్ష బీభత్సంలో ఆకారాన్ని యెట్లా పసిగట్టిందో! శబ్ద భేది విద్యలాంటిది ఆమె వశమైనట్టుంది. కెమెరా ముఖం వున్న వేటకుక్క నాలో నుంచి దూసుకుపోయింది. మరి నీకు భయంగా లేదా? నువ్వే అమ్మాయి ననుకో అని మళ్ళీ సంభాషణలోకి దిగింది.

(మగవాళ్ళయితే భయంగా వుండదనా దాని అర్థం? నేను అమ్మాయిని కాదు. నేను అమ్మాయిని కాకపోవడంవల్ల తెలియని యేదో భరోసా వుంది నాలో. కేవలం మగవాడిగా వుండడంవల్ల మాత్రమే వుండే భరోసా యేమిటి?)

నేనే అమ్మాయినైతే నీ మాదిరిగా యిట్లా చోటు గాని చోటులో వేళ కాని వేళలో మాత్రం చిక్కుకు పోను. తోడు లేకుండా రాను అన్నాను. ఆ అమ్మాయి జీవన సిద్ధాంతాన్ని నేను ఎంతగా వ్యతిరేకిస్తున్నానో నాకే అర్థమైంది నా సమాధానంతో.

ఆమె ఇక నాతో మాటలు కట్ చేసేస్తుందనుకున్నాను.

అంటే ఒకవేళ నేనే నువ్వనుకో. అప్పుడు? అని ఆమె మామూలుగానే ప్రశ్నను స్పష్టపరుస్తోంది. ఆ అమ్మాయిని హర్ట్ చెయ్యడం కష్టం.

– నాకు తండ్రి వయసు వున్న వ్యక్తి దగ్గరికెళ్ళి–అదుగో ఆమూలన వున్నాడే ఆయన దగ్గరకు వెళ్ళి యేమండీ నేనో వృత్తి ఫోటోగ్రాఫర్‌ని. మారుమూల పాడుబడిన గుళ్ళు తిరుగుతుంటాను. ఈ రాత్రి చివరి బస్సు కోసం యెదురు చూస్తుండగా ఈ తుపాను వచ్చిపడింది. ఎనిమిది గంటల బస్సు ఇక రాకపోవచ్చు. ఎక్కడయినా రోడ్డు మునిగి వుండొచ్చు. పక్క టౌన్‌లో నా బస. నా వూరు ఫలానా. నా తల్లిదండ్రులు ఫలానా.

మిగతా 13వ పేజీలో



## మనసు వైద్యం

# లేటు వయసులో ఘాటు నిర్ణయాలు వద్దు

"బాబూ! వయసులో నాకంటే చిన్న వాడివే అయినా నువ్విచ్చిన సలహా జీవిత చరమాంకంలో పెనుతుపాను తప్పించింది. ఇన్నేళ్ళ నా పరువుకూ, ప్రతిష్ఠకూ అప్రతిష్ఠ రాకుండా చేసింది.

నా జీవితంలో ఎన్నో ఒడిదుదుకులు, మధురానుభూతులు చవిచూశాను. ప్రతి సంఘటనా నాకు ఓ అనుభవాన్నిచ్చింది. ఇంత విశేష అనుభవం గడించినా నా ఒంటరితనం నన్ను ఆ విషయంలో సరైన నిర్ణయం తీసుకునేలా చేయలేకపోయింది. అందుకే మీ సలహా అర్థించాను. ఒకవేళ నేనే నిర్ణయం తీసుకోవలసి వుంటే కథ మరోలా ఉండేదేమో. నా పరువు, నా బిడ్డల ప్రతిష్ఠ, మా కుటుంబ గౌరవం నిలిపిన మీకు పెద్దవాడినైనా చేతులెత్తి నమస్కరిస్తూ సెలవు తీసుకొంటున్నాను."

శేషగిరిరావు గారి ఉత్తరం చదివి టేబిల్ మీద పెట్టాను.

శేషగిరిరావు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కూతురు కలకత్తా, కొడుకు బరంపురం, రెండవ కొడుకు న్యూయార్క్. ముగ్గురు మూడు ప్రాంతాల్లో పెళ్ళిళ్ళు చేసుకుని స్థిరపడిపోయారు. అయినా సొంత ఇంటి మీద, సొంత ఊరి మీద మమకారంతో శేషగిరిరావు దంపతులు ఎక్కడికి వెళ్ళకుండా ఉండి పోయారు. పండుగలకు పబ్బాలకూ పిల్లల దగ్గరకు వెళ్ళడమో, వాళ్ళు పల్లెకు రావడమో జరుగుతుంది.

వృద్ధాప్యంలో ఒకరికొకరు తోడుగా ఉంటున్న తరుణంలో శేషగిరిరావు అరవయ్యవ ఏట భార్య మరణించింది. శేషగిరిరావు కుంగిపోయాడు. తండ్రిని ఒంటరిగా వదలడం పిల్లలకు ఇష్టం లేదు. ఒక నెల కూతురి దగ్గర మరో నెల కుమారుడి దగ్గర ఉన్న శేషగిరిరావు తన భార్యను పోగొట్టుకోవడమే కాక ఇంటిని వదిలి వచ్చి స్వేచ్ఛను కూడా పోగొట్టుకున్నానని గ్రహించాడు. ఇంటికి వెనుతిరిగి వచ్చేశాడు. ఎండిపోయిన చెట్టుకు మళ్ళీ పాదులు చేసి నీళ్ళు పోసి పచ్చగా చెయ్యాలనే ప్రయత్నం మొదలు పెట్టాడు.

'ఎవ్వరొచ్చారు బాబూ...'

ఆ ప్రశ్నకు తలెత్తి చూశాడు శేషగిరిరావు. పక్కింటి పంకజం.

"నేను నీళ్ళు పోస్తాను. మీరు పాదులు చెయ్యండి, నీళ్ళు మీరు మోయలేరు. అనవసరంగా అడ్డం పడతారు" అన్నది పంకజం. శేషగిరిరావు సమాధానం కోసం ఎదురు చూడకుండా నీళ్ళ బక్కెట్ అందుకొంటూ.

"వద్దొద్దు!" అంటూ వారించబోయాడు. అయినా పంకజం వినిపించుకోలేదు.

పంకజానికి యాభై అయిదు సంవత్సరాలుంటాయి. పేదరాలు, ఒంటరిగా వుంటోంది. శేషగిరిరావు భార్య పోయినప్పుడు ఇంటిలో చెప్పలేనంత చాకిరీ చేసింది. నిజానికి ఆమె పట్ల శేషగిరిరావుకి సదభిప్రాయం లేదు. ఆమె వయసులో ఉన్నప్పుడు గుణవంతురాలు కాదని చెప్పుకునేవారు. అయితే కష్ట కాలంలో చొరవ తీసుకుని పంకజం చేసిన సేవలు శేషగిరిరావుకి తొలిసారి ఆమె పట్ల గౌరవం కలుగజేశాయి.

వరుసగా రెండు రోజులు ఇల్లు బాగు చేయడం, చెట్లకు పాదులు చెయ్యడం చేసేసరికి శేషగిరిరావుకి జ్వరం వచ్చేసింది. ఊరెళ్ళి మళ్ళీ రావడం వల్ల పనిమనిషిని కూడా ఇంకా మాట్లాడుకోలేదు. "కాఫీ



ఇచ్చే దిక్కు కూడా కరవై పోతుందే" అనుకొంటున్న తరుణంలో పంకజం ప్రత్యక్షమైంది. శేషగిరిరావుని చూసి, "నేననుకుంటూనే ఉన్నా అడ్డం పడిపోతారేమోనని" అన్నది.

కాఫీ కాచి ఇచ్చింది. ఆటోను పిల్చుకువచ్చి డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళింది. ఒళ్ళు అలసి వచ్చిన జ్వరమో, ఊరి మార్పు వలన వచ్చిన జ్వరమో గానీ టైఫాయిడ్‌గా మారింది. బెడ్ రెస్ట్ అవసరమని డాక్టరు చెప్పారు. ఏం చెయ్యాలో పాలు పోలేదు. హాస్పిటల్‌లోనే అడ్మిట్ అవుదామనుకున్నారు. అయితే పంకజం ఒప్పుకోలేదు. హాస్పిటల్‌లో మాత్రం చూడడానికి మరో మనిషి కావద్దా అంటూ ఇంటికి తీసుకొచ్చేసింది. అదేదో సినిమా కథల్లో లాగా నిజంగానే పగలూ రాత్రి శుశ్రుషలు చేస్తూ వేళకు మందులిస్తూ శేషగిరిరావును మామూలు మనిషిని చేసింది.

పంకజం పట్ల అవ్యక్తమైన అభిమానం ఏర్పడింది. అలా మొదలైన అభిమానం ఇద్దరినీ దగ్గరకు చేసింది. అయితే ఇరువురిలోనూ ఏ విధమైన లైంగిక స్పందనలు, ప్రేరణలు వంటివి మచ్చుకైనా లేవు. అదే శేషగిరిరావుకి ఆమె పట్ల అభిమానాన్ని రెట్టింపు చేసింది. అందుకే వారి స్నేహాన్ని వివాహంగా మార్చుకోవాలని అందుకు తమ బిడ్డలు అభ్యంతర పెట్టినా ఖాతరు చేయకూడదనీ నిర్ణయించుకున్నాడు శేషగిరిరావు. కానీ శేషగిరిరావులో ఎక్కడో ఏ మూలో ఏదో అనుమానం మిగిలి వుంది. పంకజం నిజాయితీని అతడు ఎందుకో శంకిస్తున్నాడు. ఆమె నిజంగానే అభిమానంతో తనకు దగ్గరయిందా, లేక అవసరంతో అండను కోరుతోందా అని తేల్చుకోలేకపోతున్నాడు.

తన కథంతా సన్నిహిత మిత్రుడికి చెప్పుకున్నాడు. అతడు ఒకసారి నా సలహా తీసుకోమని చెప్పాడు. మిత్రుడి సలహా మేరకు శేషగిరిరావుగారు నా దగ్గరకు వచ్చారు. నిజానికి నాకు ఈ విషయంలో సలహా ఇవ్వడం కాస్త ఇబ్బంది అనే అనిపించింది. ఒంటరిగా ఉన్న శేషగిరిరావు అదే ఒంటరితనంతోనూ, పేదరికంలోనూ ఉన్న పంకజం. ఇద్దరూ ఒకరికొకరు సహాయసహకారాలు అందించుకుంటున్న దశలో హ్యూమానిటీతో ఆలోచించడమా? సైకలాజికల్‌గా ఆమెను స్టడీ చేసి సలహా ఇవ్వడమా అనేది తేల్చుకోవడం కష్టమే. ఆమె అవసరంలో అతని అండ కోరినా అది తప్పు కాదు. కానీ అతని ధనాన్ని ఆశించి, ఆమె ఒక పథకం ప్రకారం ప్రయత్నిస్తుంటే మాత్రం అతను సైకలాజికల్‌గా దెబ్బతింటాడు. వృద్ధాప్యంలో పెళ్ళిని పిల్లలు ఎలా అంగీకరించరు. అలా అని వారి సమక్షంలో అతని జీవితం గడవదు. కనుక తోడుకోసం అతను కఠిన నిర్ణయం తీసుకోవడంలో తప్పులేదు. చాలా ఆలోచించాక ఒక సలహా యిచ్చారు. "మరో సంవత్సరం పాటు ఇలాగే ఉందాం! ఆ తర్వాత అయినా పిల్లలు ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుందాం. సమాజం ఏమనుకున్నా నేను ఖాతరు చెయ్యను" అని చెప్పండి. ఒక సంవత్సరం తర్వాత ఆమె వ్యవహారంలో ఏవిధమైన మార్పులేకపోతే నిరభ్యంతరంగా పెళ్ళి చేసుకోండి? అని చెప్పాను.

అతను అదే మాటను ఆమెకు చెప్పాడు. ఆనెకొన్నాళ్ళు బాగానే వుంది. కానీ అసహ్యంగా ప్రవర్తించేది. కొద్ది రోజులకి కొంత ఆర్థిక సహాయం చేయమని అడిగింది. అతను యిచ్చేవాడు. ఆమె ఇంకా ఇంకా అడిగేది. అతను ఏవో కారణాలు చెప్పి యివ్వడం మానుకున్నారు. ఒక రోజు ఆమె మాయమైంది.


ఆ తరువాత తెలిసిందిట ఆమె ఒక స్మగ్లర్‌ని తనకంటే వయసులో చిన్నవాడితో కలిసి కాపురం చేస్తోందని. శేషగిరిరావు తీవ్రంగా షాక్ అయ్యాడు.. పెరటిలో మొక్కలన్ని పీకేసి పూలకుండీలనీ పగుల కొట్టేశాడు. అరటి చెట్లను నరికేశాడు. మనుషుల్ని ఎవరినీ దగ్గరకు రానీయకుండా తనలో తనే గొణుక్కోవడం, హిస్టీరిక్‌గా ప్రవర్తించడం చేసేసరికి ఆయన స్నేహితుడు నా దగ్గరకు తీసుకువచ్చాడు. నేను ముందుగా ఆయన చెప్పేదంతా ఓపిగ్గా విన్నాను. అతని బాధంతా బయటకు వచ్చింది. మనిషి కొంత తేటపడ్డాడు. హిప్నటైజ్ చేసి ట్రాన్స్‌లోకి తీసుకువెళ్ళి రిలాక్స్ అవమని సజెషన్ యిచ్చాను. రిలాక్సేషన్ థెరపీ అతని మనసును తేలిక పరిచింది. తర్వాత కూర్చోబెట్టుకుని చెప్పాను.

మనుషులని చెడ్డవాళ్ళుగానూ, మంచివాళ్ళుగానూ మాత్రమే విభజించుకోవద్దు. మధ్యలోనూ ఎన్నో దశలుంటాయి. ఆయా కాల, స్థితులను బట్టి మనుషుల గుణగణాలు వుంటాయి. ఆమె ఒంటరి. బతుకు సమస్య ఆమెది. మీ సాహచర్యం ఆమెకి అవసరం. ఆమెది భౌతిక సమస్య. మీకూ ఆమెతోడు అవసరం. ఆమె సాహచర్యం మీకు మానసిక అవసరం కూడా. అయితే ఆమెను మహోన్నత త్యాగమూర్తిగా ఊహించుకున్నారు మీరు. అటువంటి స్త్రీ కోసం పిల్లల అభ్యంతరాలనీ, సమాజం ఎగతాళినీ పట్టించుకోకూడదనుకున్నారు. కానీ ఆమె మామూలు స్త్రీ. మీతోడు సాధ్యం కాదని అనిపించాక ఆమె ప్రత్యామ్నాయం వెతుక్కుంది. ఆమెవైపు నుంచి ఆమె కరెక్టే. మీరు ఆమె అవసరాలనూ పరిస్థితులను అర్థం చేసుకోక ఆమె నుంచి ప్రేమాభిమానాలు మాత్రమే ఆశించారు. అందుకే అంత నిరాశపడ్డారు. ఈ వయసులో యింత గందరగోళం సృష్టించుకోవడం మంచిదికాదు. మనసుని వేరే అంశాల మీదకు మళ్ళించుకుని ప్రశాంతంగా జీవించండి.

ఎంతో మారాడు శేషగిరిరావు, ఇప్పడతను సాయిబాబా భక్తుడు. భజనలు, అన్నదానాలు, సేవా కార్యక్రమాల్లో ఆయన సేదతీరుతున్నాడు.

– డాక్టర్ వి.నాగేష్
హిప్నటిస్ట్,
208 సెకండ్ ఫ్లోర్, కరన్ సెంటర్
పార్క్‌లేన్‌చౌరస్తా వద్ద, సికిందరాబాద్–3


## ఇలా చేస్తే సరి



పులుసులో ఉప్పు ఎక్కువయితే దానిలో ఒక బంగాళదుంప వేసి ఉడకబెడితే ఉప్పును దుంప పీల్చుకుంటుంది.



ఇడ్లీ పాత్రలో ఒక పల్చటి శుభ్రమైన రేకుముక్క వేసి వుంచితే నీళ్ళు అయిపోయినప్పుడు అది గడగడ శబ్దంతో మనకు జ్ఞాపకం చేస్తుంది.



గంధం నూనె నాలుగు చుక్కలు స్నానం నీళ్ళలో వేసి స్నానం చేస్తే చర్మ వ్యాధులు రావు.



తేనెను గోరువెచ్చని నీటితో కలిపి తీసుకుంటే గొంతు బాధలు పోతాయి.



రఫ్‌గా వుండే చర్మానికి క్యారెట్ లోషన్ అద్భుతంగా పనిచేస్తుంది.

– ఎన్.శివానంద్

కథ
12వ పేజీ తరువాయి

నాకు ఇంత మంది అన్నదమ్ముళ్ళు, అక్క చెల్లెళ్ళు అని పరిచయం చేసుకుని ఆయన కుటుంబ సభ్యుల పరామరికలో బస్సు వచ్చేదాకా నిశ్చింతగా కాలక్షేపం చేస్తాను అని జవాబు చెప్పాను నేను. (ఈనాడు ఇది చదువుతుంటే ఎంత ముసిలిమాటలు అనిపిస్తున్నాయి)

అట్లా ఎందుకు పరిచయం చేసుకోవడం? ఆమె గొంతు కటువుగా వుంది. రిస్క్‌లేని నిరీక్షణ కోసం కొన్ని పద్ధతులుంటాయి అన్నాను నేనూ తగిలేలా.

– బ్లడీ Academic Education! ఒక మనిషికి చలేస్తుందా లేదా తెలుసుకోడానికి నీకు చలిగా వుందా? అని అడగడం Scientific method అనుకునే అధోగతిలో వున్నాం యింకా. పరీక్షలు రాసి రాసి విషయాలన్నీ Question and Answersగా మారిపోయాయి. ఒకటీ రెండేళ్ళ కోర్సు చదివేస్తే కెమెరా ఎట్లా వాడాలో తెలిసిపోతుందనుకుంటాం. యేదో ఒక మార్గాన ఎదుటి మనిషి గురించి వివరాలు తెలుసుకుని ఎవరి జాగ్రత్తలో వాళ్ళు మాట్లాడడం పద్ధతిగల మానవ సంబంధాలనుకుంటాం. యే పరిచయంతో మనం ఇప్పటిదాకా మాట్లాడుకుంటున్నాం? అని నన్ను తిట్టేస్తోంది ఆ అమ్మాయి. నన్నాకడినేనా?

నేనింక తట్టుకోలేక పోయాను. నా శాలువా నాకిచ్చేయ్ అన్నాను. (నా చుట్టుపక్కల వున్న మనుషులు–ఈ మాటలు వింటారేమోనని నేను జంకడానికి తప్ప యింక దేనికీ పనికిరానిదనిపించింది. చిన్న సంఘం) ఆ అమ్మాయి ఇవ్వక పోవడంతో నేనే లాక్కున్నాను.

ఆమె మాట్లాడిందేమిటి? నేను చేస్తున్న దేమిటి అన్న యింగితం లేకుండా పోయింది నా కష్టడు.

అదెట్లా కుదురుతుంది? అని ఆమె చిన్నపిల్లలా శాలువ లాక్కుంది తిరిగి. అయితే నా కొద్దు అని మొత్తం ఆమె మీదికే విసిరాను.

వద్దనుకుంటే వద్దని చెప్పగాని ఈ శాలువా భాష యేందబ్బాయ్ అని ఆమె అంతా కప్పకుని వెచ్చగా కూచుంది.

ఆమె యేమీ మాట్లాడలేదింక.

నేనూ యేమీ మాట్లాడలేదు.

నేనూ బిర్రుగా బిగదీసుకున్నాను కొయ్యలాగా.

చలి సన్నగా కోస్తోంది. వర్షం అదే ప్రకారంగా నిలబడి కురుస్తోంది.

కొంచెం సేపటికి–ఆ శాలువా నాది అన్నాను గుర్రుగా.

నువ్వు నీ డబ్బులు పెట్టి కొన్నావా?

అవును.

నీ వొక్కడి కోసమే అని కొన్నావా?


అవును.

అయితే ఈ వర్షంలో చలిలో నేనిక్కడ వుంటానని కాదా నువ్విది తెచ్చింది? అని ఆమె ఆశ్చర్యం ప్రదర్శించింది.

నీకేమయినా పిచ్చా? నువ్వెవరో ఇక్కడ వుంటానని కలగని తెచ్చాననుకున్నావా యిది? అన్నాను (నేను గట్టిగా మాట్లాడేసి నోరగా మనుషులను గమనించాను)

పోనీ యిప్పుడు కలగను అంది. ఆమె కొంటెతనంలోకి మళ్ళుతోంది. యెకసెక్కాలుగా వుందా? నాకు చలి అన్నాను.

## ఫోటోగ్రాఫర్



అయితే దగ్గరిగా జరుగు కప్పతా అంది.

ఇంత సడన్‌గా మా మధ్య పోట్లాట సయోధ్య జరుగుతుండడం నాకు ఆశ్చర్యంగా వుంది మాట్లాడుతున్నంత సేపూ కూడా.

కొద్ది సేపటికి ఆమె తల నా భుజం మీద వుంది. నిద్రపోతోంది.

నేనా కాపలా?

తిరుగులేని ఆమె నిర్భయం నాలోనూ ధైర్యాన్ని నింపి ఆమెకు విశ్వసనీయుణ్ణి చేసింది ఆ సమయాన. నా స్వీయ జీవన సిద్ధాంతం యేదో చెదిరిపోసాగింది. ఒకసారి ఆమె ప్రయాణించిన ఓడలో ఒక కళాసీ తటస్థించాడట. మబ్బుల తీరూ వన్నె చూసి యే దిక్కున యే వాన పడేదీ ఖచ్చితంగా చెప్పేవాడట. యెట్లా చెపుతావ్ అని కెప్టెన్ అడిగితే వివరించడానికి ఆ కళాసీ యెంతగానో ప్రయత్నించేవాడట. నాకేం అర్థం కావడం లేదు. అని పెదవి విరిచేవాడట కెప్టెన్. పుస్తకాల్లోకి యెక్కింది తప్ప యింకేం అర్థం చేసుకోలేని paper-age మానవులం. మన తలకాయల్లో గాలీ వెలుతురూ లేని భయానకమైన కట్టుబాట్ల కారణంగా కొత్తని నేర్చుకోం. పాతని మర్చిపోం. ఇంకా అక్షరాల్లోకి అనువాదం కాని కళ్ళెదుటి కాలం ఆ ఓడ కళాసీలా అర్థం కానిదయిపోయింది. పుస్తకాలకి జడిసి పుస్తకాలతో జడిపించీ ప్రతిదాన్నీ దూరం మంచి పరిచయం చేసుకుని జాగ్రత్తలతో దగ్గరికి జరిగే వాళ్ళకి ఏదయినా అర్థం అవుతుందా? మాటలతోనే అర్థమైపోయే విషయాలు ఎంత అల్పమైనవి అని ఇంకా మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయిందామె.

నాపైన కొత్త బరువు.

నా తేలిక అభిప్రాయాలు కుంగుతున్నాయి.

ఎన్నో వేల యేళ్ళ నుంచి ఈ ప్రపంచమంతా పరిచయమేమో యీమెకి. తెల్లవారి కూడా వర్షం కురుస్తూనే వుంది. రాత్రంత కాదు. ఆ వానకీ ఈ వానకీ పోలికే లేదు. బస్సు వెళుతూ వుండగా కిటికీలో వానతో ముఖం తడుపుకుందామె. నేను గమనిస్తుంటే నవ్వింది. ఆమె ముక్కుకీ కనుకొలకులకీ మధ్య చర్మం మెరిసింది సోగ వల్లగా. కళ్ళద్దాలు పెట్టుకుని బయటికి చూస్తోంది జల్లుకి తడుస్తూ. కెమెరాతోబాటు మేం ముగ్గురమూ యేం మాట్లాడుకోలేదు. టౌనులో దిగాం.

చెయ్యి వూపి ఆమె బస వైపు వెళ్ళిపోతుంటే నిర్ఘాంత పోయాను. ఇంత నిర్దయా? రాత్రి స్నేహం ఒక్క మాట శబ్దంతో చెదిరిపోతుందనా? మేమేమి పరిచయం చేసుకోలేదు అకడమిక్‌గా అని స్ఫురించింది నాకు.

ఇక్కడితో నా రఫ్ నోట్సు ముగిసింది.

నా పాతకాయితాలు చదివి చాలా సేపటిదాకా యేం మాట్లాడలేదు నావాడు.

ఆ మేగజైన్‌లో సాయుధ యువతుల ఫోటోను అదేపనిగా చూస్తూ–ఈ పిల్లేనా? అని అడిగాడు.

నమ్మితే నమ్ము. లేకుంటే మానై. అదిగో అదే శాలువా అన్నాను దండెం చూపిస్తూ.

ఆ రాత్రి టీ తాగుతూ కూచున్నాం.

డిసెంబరు చలి

ఆ పిల్ల ఎప్పటికీ సరెండర్ కాదు–యెవరికీ అన్నాడు నావాడు ఎవరితోనో అంటున్నట్టు.

ఆ పిల్ల మాట్లాడింది ఫోటోగ్రఫీ గురించేనా? ■

(ఈ కథ సాంకేతిక నిర్ధారణ–సినిమా ఫొటోగ్రాఫర్ నైశివగణపతి)

బొమ్మలు అక్బర్

వచ్చేవారం కథ
**గతుకు**
– వి.ప్రతిమ